
www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
శుక్రవారం | 06 | ఫిబ్రవరి | 2026 | పేజీలు: 08





"ఇంద్రేశం మున్సిపాలిటీలోని అన్ని ప్రాంతాలలో అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతుంది. కింది స్థాయి సిబ్బంది చేతివాటం, అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా అక్రమ నిర్మాణదారులు స్పీడు పెంచారు. కొంత మంది నిర్మాణ దారులు మున్సిపాలిటీ నుంచి భవణాల నిర్మాణం కోసం జీ ప్లస్2 పర్మిషన్ తీసుకొని ఐదు నుంచి ఆరు అంతస్తుల వరకు నిర్మాణాలు జరుపుతున్నారు. అక్రమ నిర్మాణాల కారణంగా భవిష్యత్‌లో మౌలిక వసతుల కల్పనలో మున్సిపాలిటీకి ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఉన్నా అధికారులు ఎందుకు ఈ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇంద్రేశం మున్సిపాలిటీలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

# అక్రమం అంతెత్తు..

# అడగరు వీసమెత్తు...!

## ఇంద్రేశంలో ఆగని అక్రమ నిర్మాణాలు

మూన్నాళ్ళ ముచ్చటగా మారిన కూల్చివేతలు

అధికారుల తీరుపై ప్రజల విస్మయం

కూల్చిన చోట మళ్లీ నిర్మితమవుతున్న భవనాలు

అధికారులు ఎన్నికల్లో బిజీ.. అక్రమార్కులు నిర్మాణాలలో బిజీ బిజీ

టౌన్ ప్లానింగ్ అధికారి ప్రేక్షక పాత్రలో?

మున్సిపల్ కమిషనర్ బిల్డర్లతో ములాఖత్?





**పటాన్‌చెరు, అక్షిత ప్రతినిధి :** ఇంద్రేశం మున్సిపాలిటీలోని అన్ని ప్రాంతాలలో అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతుంది. కింది స్థాయి సిబ్బంది చేతివాటం, అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా అక్రమ నిర్మాణదారులు స్పీడు పెంచారు. కొంత మంది నిర్మాణ దారులు మున్సిపాలిటీ నుంచి భవణాల నిర్మాణం కోసం జీ ప్లస్2 పర్మిషన్ తీసుకొని ..మిగతా 2లో

### మహిళా సంఘాలకు

## పక్కా భవనాలు

రూ.8.40 కోట్లతో భవనాలు

ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వెల్లడి



**జడ్చర్ల, అక్షిత న్యూస్:** జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళా సంఘాలకు చెందిన 84 గ్రామైక్య సంఘాల (వీఓలు)కు రూ. 8.40 కోట్ల వ్యయంతో సొంత భవనాలను నిర్మించడానికి ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. మహిళా సాధికారత సాధనలో కీలకంగా నిలుస్తున్న గ్రామ మహిళా ..మిగతా 2లో

### ఇంటిగ్రేటెడ్ స్కూల్

## పనులు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్



**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:** ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు చేపట్టిన చర్యలో భాగంగా తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ తెలిపారు. బుధవారం ..మిగతా 2లో

## ముద్రణలో లోపాలు తలెత్తొద్దు

బ్యాలెట్ పేపర్ల ముద్రణ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





**నిర్మల్, అక్షిత ప్రతినిధి:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి, బ్యాలెట్ పేపర్ల ముద్రణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని ఆదర్శనగర్ లో గల విజయ్ ..మిగతా 2లో



### బ్యాలెట్ పేపర్ ముద్రణలో

## అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఎన్నికల అథారిటీ

ఆదర్శ్ సురభి

**వనపర్తి, అక్షిత ప్రతినిధి :** బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్ పేపర్ల ముద్రణ విషయంలో అధికారులు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అథారిటీ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టర్ తన చాంబర్లో మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు ఎంపీడీవోలతో బ్యాలెట్ పేపర్ల ముద్రణ విషయంలో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో వార్డుల వారిగా పోటీ చేస్తున్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తుల వారిగా జాగ్రత్తగా చూసుకోవాలని, బ్యాలెట్ పేపర్ క్రమ సంఖ్య, నాణ్యత తదితర అన్ని అంశాలు ..మిగతా 2లో

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు వేగవంతం చేయాలి

మొదటి పేజీ తరువాయి...

తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో 200 కోట్ల రూపాయలతో 20 ఎకరాలతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు సంబంధిత గుత్తేదారుకు భవన నిర్మాణ పనులు నాణ్యతతో ఎక్కడా రాజీ పడకుండా పనులు చేయాలని అవసరమైతే ఎక్కువమంది పని వారిని పెట్టి భవనాన్ని త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ పేర్కొన్నారు. నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వేణుమాధవ్, ఎమ్మార్వో హరిప్రసాద్, ఎంపీడీవో లాజర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముద్రణలో లోపాలు తలెత్తొద్దు

మొదటి పేజీ తరువాయి...

ఆఫ్ సెట్ ప్రింటింగ్ ప్రెస్ లో, మున్సిపల్ ఎన్నికల బ్యాలెట్ పేపర్ల ముద్రణ ప్రక్రియను, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైనన్ని బ్యాలెట్ పేపర్లను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణలో ఎటువంటి లోపాలు తలెత్తకూడదని పేర్కొన్నారు. అనధికార వ్యక్తులను ఎవరిని ముద్రణ కేంద్రంలోకి అనుమతించకూడదని చెప్పారు. ముద్రణ ప్రక్రియ మొత్తం పూర్తయ్యేంతవరకు పటిష్ట పోలీసు బందోబస్తు కొనసాగించాలని వివరించారు. బ్యాలెట్ పేపర్ ముద్రణ విధులు కేటాయించిన సిబ్బంది, ముద్రణ తీరును మొత్తం క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు.

ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, జెడ్పీ సీఈవో శంకర్, ఉద్యానవన పంటల అధికారి రమణ, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బ్యాలెట్ పేపర్ ముద్రణలో అప్రమత్తంగా ఉండాలి



మొదటి పేజీ తరువాయి...

జాగ్రత్తగా చూసుకోవాలని ఆదేశించారు. అనంతరం వచ్చిన బ్యాలెట్ పేపర్లు స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరచి సి.సి. కెమెరా లు ఏర్పాటు చేసుకోవడంతో పాటు పోలీస్ భద్రత కల్పించాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది శుక్రవారం సాయంత్రం వరకు పోస్టల్ బ్యాలెట్ కొరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

శుక్రవారం అన్ని మున్సిపాలిటీల పరిధిలో రెండవ దఫా ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శిక్షణ సందర్భంగా శుక్రవారం సాయంత్రం వరకు పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఒకరోజు శిక్షణ కార్యక్రమం అన్ని వసతులతో పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

**8వ తేదీలోపు ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలి**

ఓటర్లందరికీ బిఎల్ ఒ లు, వార్డు ఆఫీసర్ల ద్వారా ఓటరు స్లిప్పులు అందజేయాలని, పంపిణీ ప్రక్రియ ఫిబ్రవరి 8 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు.

అభ్యర్థులకు వాహనాల అనుమతి మున్సిపల్ కమిషనర్ల ద్వారా జరగాలని, అదేవిధంగా పార్టీ సమావేశాలు, ర్యాలీలకు పోలీస్ అధికారుల నుండి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓ లు తదితరులు టెలికాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

# అక్రమం అంతేత్తు.. అడగరు వీసమెత్తు...!

మొదటి పేజీ తరువాయి...

ఐదు నుంచి ఆరు అంతస్తుల వరకు నిర్మాణాలు జరుపుతున్నారు. అక్రమ నిర్మాణాల కారణంగా భవిష్యత్‌లో మౌలిక వసతుల కల్పనలో మున్సిపాలిటీకి ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఉన్నా అధికారులు ఎందుకు ఈ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇంద్రేశం మున్సిపాలిటీలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణలపై చర్యలు తీసుకోవాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.



**ఇవీ నిబంధనలు...**

భవన నిర్మాణాలు చేపట్టే ప్రజలు అనుమతుల కోసం దరఖాస్తు చేసే సమయంలో సమర్పించిన ప్లాన్‌ను విధిగా అమలు పర్చాలి. అనుమతి కాపీలో పేర్కొన్న విధంగా నిర్మాణం చేపట్టాలి. సెట్ బ్యాక్, రోడ్డు నిబంధనలు పాటించడంతోపాటు అనుమతులు ఉన్న మేరకు పై అంతస్తుల నిర్మాణం చేపట్టాలి. గృహావసరాల కోసం అనుమతులు పొంది, కమర్షియల్‌గా ఉపయోగించే వారిని సైతం నిబంధనల ఉల్లంఘన జాబితాలో చేర్చుతారు. గృహ, కమర్షియ ల్ భవన నిర్మాణాలతో పాటు లే అవుట్ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసే ప్లాట్లు చట్ట విరుద్ధం కాగా, అలాంటి వాటిపై



టాస్క్‌ఫోర్స్ బృందాలకు చర్య లు తీసుకొనే అధికారం ఉంది.

**చతికిలబడ్డ చట్టం...**

మున్సిపాలిటీల పరిధిలో అనుమతులు లేకుండా చేపట్టే నిర్మాణాలను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం మున్సిపల్ చట్టం 2019లోని టీఎస్–బీ పాస్‌కు కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా లేఅవుట్ పర్మిషన్, భవన నిర్మాణాలకు అనుమతులు, తదితర ప్రక్రియను పటిష్టం చేసేందుకు కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందాలను సైతం నియమించింది. నిబంధనలను అతిక్రమించే వారి పట్ల కఠినంగా వ్యవహరించేలా టాస్క్‌ఫోర్స్ బృందాలకు విస్తృత అధికారాలను ప్రభుత్వం కట్టబెట్టింది. అందులో భాగంగా అనుమతులు లేని నివాస గృహాలు, కమర్షియల్ భవనాలతో పాటు లేఅవుట్ లేని వెంచర్లలోని నిర్మాణాలను ఎలాంటి ముందస్తు నోటీసులు జారీ చేయకుండానే నేరుగా కూల్చే అధికారం టాస్క్‌ఫోర్స్ బృందాలకు ఉంది.

**ఉల్లంఘనలను ప్రశ్నించే వారే లేరు**

నిబంధనల ప్రకారం అనుమతులకు విరుద్ధంగా ఇంద్రేశం మున్సిపాలిటీలో బహుళ అంతస్తుల భవనాలు నిర్మించకూడదు. స్థిరాస్తి వ్యాపారులు ప్లాట్లు కొనుగోలు చేసి వాటిల్లో యదేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. సెల్లార్లు, పునాదులు తవ్వేటప్పుడు మున్సిపల్ అధికారులు వెళ్లి అనుమతులు లేకుండా ఎలా నిర్మిస్తున్నారంటూ ప్రశ్నించడం లేదు. పైగా ఒకటి రెండు అంతస్తుల వరకు వచ్చాక...భవన నిర్మాణం పూర్తి కాకముందే...ఇంటి నంబర్లు ఇచ్చి అక్రమాలకు సహకరిస్తున్నారని విమర్శలున్నాయి. ఈ తంతులో మామూళ్ల వ్యవహారం నడుస్తోంది. ఇంటి నంబరు రాగానే విద్యుత్, నల్ల కనెక్షన్లను అక్రమార్కులు తెచ్చుకుంటున్నారు. మున్సిపల్ రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, మున్సిపల్ కమిషనర్ అందరూ కలిసి మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలను, నిర్మాణదారులను సహకరిస్తున్నారని మున్సిపల్ ప్రజలు బాహాటంగా చర్చించుకుంటున్నారు. అక్రమాలను సహకరించి, ప్రోత్సహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా పాలనధికారికి మున్సిపల్ పరిధిలోని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మహిళా సంఘాలకు పక్కా భవనాలు

మొదటి పేజీ తరువాయి...

సంఘాలకు సొంత భవనాల నిర్మాణంతో మహిళలు మరింతగా అభివృద్ధి చెందే అవకాశం ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు.

జడ్చర్ల నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల్లో ఈ భవనాల నిర్మాణం మంజూరైయిందని గురువారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో అనిరుధ్ రెడ్డి తెలిపారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఒక్కొక్కటి రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించే వీఓ భవనాల్లో ఊర్కొండ మండలానికి 16, మిడ్జిల్ మండలానికి 5, రాజాపూర్ మండలానికి 8, బాలానగర్ మండలానికి 17, జడ్చర్ల మండలానికి 14, నవాబుపేట మండలానికి 24 చొప్పున మంజూరు అయ్యాయని చెప్పారు. ఊర్కొండ మండలంలోని బొమ్మరాసుపల్లి, గుడిగానిపల్లి, గండ్లగుంటపల్లి, ఇప్పలపాడు, జగబోయినపల్లి, జకినాలపల్లి, లోక్యాతాండా, మాచారంపల్లి, మాదారం, నర్సంపల్లి, రాచాలపల్లి, రన్ రెడ్డిపల్లి, రేవల్లి, తిమ్మన్ పల్లి, ఊర్కొండ, ఊర్కొండపేట, మిడ్జిల్ మండలంలోని మసిగుండ్లపల్లి, ఈదులబాయి తాండ, బోయిన్ పల్లి, వేముల, మిడ్జిల్ గ్రామాల్లో విఓ భవనాలు మంజూరు



అయ్యాయని తెలిపారు. అలాగే బాలానగర్ మండలంలోని హేమాజీపూర్, గాంధీపాలెం, గంగాధరపల్లి, మోతీఘనపూర్, నేరెళ్లపల్లి, కేతిరెడ్డిపల్లి, గాలిగూడ, చింతకుంట తాండ, పెద్దాయిపల్లి, మాచారం, మోదంపల్లి, వీరన్నపల్లి, సూరారం, గుండేడ్, గౌతాపూర్, ఉడిత్యాల, చిన్నరేవల్లి గ్రామాల్లో విఓ భవనాలు మంజూరయ్యాయని చెప్పారు. జడ్చర్ల మండలంలోని ఆలూరు, అమ్మపల్లి కాలనీ, బండమీదిపల్లి, చిన్న ఆదిరాల, గొల్లపల్లి, గోప్లాపూర్, కిష్టంపల్లి, మాచారం, మల్లెబోయిన్ పల్లి, నెక్కొండ, పెద్దపల్లి, లింగంపేట్, కిష్టారం, కొత్త తాండా గ్రామాలకు కూడా విఓ భవనాలు మంజూరు అయ్యాయని వెల్లడించారు. అలాగే నవాబుపేట మండలంలోని చౌడూరు, పల్లెగడ్డ, కొండాపూర్, యన్మన్ గండ్ల, కామారం, దొడ్డిపల్లి, దర్పల్లి, గురుకుంట, దయాపంతుల పల్లి, అమ్మాపూర్, దేపల్లి, కారూర్, రుద్రారం, కొల్లూర్, హాజీపూర్, కాకర్జాల, కేశవరావుపల్లి, హనుమన్నానిపల్లి, తిమ్మాయిపల్లి, కాకర్లపాడు, సిద్దోటం, కిషన్ గూడ, ఊరంచుతాండ గ్రామాలకు కూడా విఓ భవనాలు మంజూరు కావడం జరిగిందని అనిరుధ్ రెడ్డి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ మహిళా సంఘాలు క్రియాశీలకంగా పని చేస్తున్న ప్రాంతాల్లో భవనాలు కట్టడానికి భూమి అందుబాటులో ఉంటే విఓ భవనాలను నిర్మించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 84 విఓ భవనాలను రూ. 8.40 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారని తెలిపారు. ఈ భవనాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

# కష్టపడి చదివితే భవిత బంగారం

**పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి**

**కలెక్టర్ విజయేందిర బోయి**



**మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి:** పదవ తరగతి విద్యార్థులు ప్రణాళిక బద్దంగా కష్టపడి చదివి, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించాలని అని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ పదవ తరగతి ఎస్.సి.సంక్షేమ వసతి గృహ విద్యార్థిని, విద్యార్థులకు గురువారం అంబేద్కర్ కళా భవన్ లో నిర్వహించిన వార్షిక పరీక్షలపై ప్రేరణ, అవగాహన తరగతుల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడుతూ వారు పరీక్షలకు ఏ విధంగా సిద్ధమౌతున్నారని అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు అనగానే భయం ఉంటుందని, మీకు కూడా భయం, ఒత్తిడి ఉందా? అని అడిగారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు భయపడాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆత్మవిశ్వాసంతో ప్రణాళికాబద్ధంగా చదివితే పరీక్షలను సులభంగా పాస్ అవుతారని తెలిపారు. విద్యార్థులు కేవలం ఉత్తీర్ణతకే కాకుండా అత్యధిక మార్కులు సాధించాలనే లక్ష్యంతో కష్టపడి చదవాలని సూచించారు. ఈ కీలక సమయంలో విద్యార్థిని, విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. విద్యార్థులు గణితం, ఫిజిక్స్, హిందీ కఠినమైన విషయాలను ప్రణాళికతో చదవాలని, మాక్ టెస్టులు రాయడం, ప్రాక్టీస్ పేపర్లు సాధన చేయడం ద్వారా ఈ సబ్జెక్టుల్లో కూడా మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు.

హిందీ భాష పై ప్రావీణ్యం సాధించడం కష్టమేమీ కాదని, బాగా అభ్యాసం చేయాలని అన్నారు. మాతృభాషపై పట్టు ఉన్నవారు ఇతర భాషలను కూడా సులభంగా నేర్చుకోవచ్చని అన్నారు. తాను కూడా స్పానిష్ భాష నేర్చుకోవాలనే ఆసక్తి కలిగి ఉన్నానని ఉదాహరణగా చెప్పారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లలో రీల్స్ చూసి సమయం వృథా చేయకుండా, చదువుకు ఉపయోగపడే మంచి యాప్‌లను చూడాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కష్టపడి పని చేసి పిల్లలను హాస్టళ్లలో చేర్చారని, వారి ఆశలను నిలబెట్టాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని కలెక్టర్ తెలిపారు. మంచి పోషకాహారం తీసుకోవాలని, చదువుతున్నప్పుడు మధ్య మధ్యలో విరామం తీసుకోవాలని, శారీరక వ్యాయామం చేయడం వల్ల మెదడు చురుకుగా పనిచేస్తుందని తెలిపారు. యోగా, ధ్యానం చేయడం ద్వారా ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు.



పరీక్షా సమయంలో ప్రశ్నపత్రం చూసి ఆందోళన చెందవద్దని, ప్రశ్నపత్రాన్ని పూర్తిగా చదివి తెలిసిన ప్రశ్నలను ముందుగా రాయాలని సూచించారు. అలా చేస్తే ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి సునీత,సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి సుదర్శన్, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శివ స్వాములకు అన్న ప్రసాద వితరణ

**ఆత్మకూర్(ఎం)అక్షిత న్యూస్:** మండల కేంద్రంలో శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శివదీక్ష చేస్తున్న స్వాములకు భారతీయ జనతా పార్టీ మండల నాయకులు నాతి బిక్షపతి గౌడ్ వాణి దంపతుల చేతుల మీదుగా అన్నప్రసాదం(బిక్ష)ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ఆ పరమేశ్వరుడు అష్టఐశ్వర్యాలు



ఆయురారోగ్యాలు కలిగించాలని శివ స్వాములు ఆశీర్వదించారు,ఈ కార్యక్రమంలో బెజ్జరబోయిన సాయి,గురు శివ స్వామి అయోధ్య,శివ స్వాములు నరసింహ,సోమేశ్,నర్సిరెడ్డి, శ్రీశైలం, భాగ్యలక్ష్మి,శ్యామ్, విజయ్,ఉపేందర్,వెంకటేష్, యాదగిరి నర్సయ్య, ప్రసాద్,సంతోష్,సందీప్,పురుషోత్తం,దామోదర్ సాయి, రాజు,మల్లేష్,విప్లవ్,రవి,సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# దాడులను సహించేది లేదు..

**న్యాయవాదుల నిరసన..**

**విధుల బహిష్కరణ**



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా న్యాయావాదులపై దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, అటువంటి దాడుల జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవచూపాలని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎండి మజీద్ కోరారు. నిన్న మొయినాబాద్ లో జరిగిన యువ న్యాయవాది స్వప్న హత్య ను నిరసిస్తూ రామన్నపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా న్యాయవాదుల పై ఎలాంటి దాడులు జరగకుండా..తక్షణమే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావలసిన అవసరం ఉందన్నారు.నిరంతరం అడ్వకేట్ లపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. ఆస్తి కోసం ఇలాంటి దాడులు, హత్యలు చేయడం అత్యంత హేయమని అన్నారు. ఆస్తి వివాదాల కోసం కోర్టులను ఆశ్రయించాలని.. ఇలాంటి దాడుల వైపు వెళ్లొద్దని కోరారు. ఈ సందర్భంగా యువ న్యాయవాది స్వప్న మరణం పట్ల వారి ఆత్మశాంతి కోసం నిమిషం పాటు మౌనం పాటించారు.ఈ కార్యక్రమములో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఏ మాజీద్ , ఉపాధ్యక్షులు, యాదాసు యాదయ్య ,సీనియర్ న్యాయవాదులు జినుకల ప్రభాకర్ , కేమ రామదాసు బసరాజు అశోక్ కుమార్ ,జగతయా, శ్రీశైలం ,కూనూరు శ్రీనివాస్,నూతి రమేష్ సతీష్ రెడ్డి ,మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, ఐ,జి పర్యటన..





**మేడ్చల్, అక్షిత బ్యూరో:** దుండిగల్ సర్కిల్ లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐ జి రాజీవగాంధీ హన్మంతు జిల్లా రిజిస్ట్రార్ అశోక్ కుమార్ తో గురువారం పర్యటించారు, కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సూరారం అద్దె భవనం నుండి దుండిగల్ కు తరలించే నేపథ్యంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను పరిశీలించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యతోపాటు ఇరుకైన ప్రదేశం కారణంగా కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సూరారం నుండి తరలించాలంటూ ప్రతి పాదనలు అందయన్నారు,దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో అనువైన ప్రదేశాన్ని పరిశీలించామని త్వరలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ అశోక్ కుమార్,జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్ నాయక్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు..

# పాఠశాల,తహశీల్దార్ కార్యాలయాల ఆకస్మిక తనిఖీ





**మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి:** కోయిలకొండ మండలం పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మండల కేంద్రంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తహసీల్దార్ కార్యాలయంలను గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ముందుగా సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, అక్కడ చికిత్స పొందుతున్న రోగులు, గర్భిణీ స్త్రీలతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది సంఖ్య, రోజువారీ ఓపీ వివరాలు, సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. రిజిస్టర్లలో నమోదు సక్రమంగా నిర్వహించాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆరోగ్య కేంద్రం శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రోజుకు ఎన్ని డెలివరీలు జరుగుతున్నాయి, ఓపీకి ఎంత మంది రోగులు వస్తున్నారు, వారు ఏ సమస్యలతో వస్తున్నారు వంటి అంశాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మందులు సరిపడా ఉన్నాయా లేదా అని సిబ్బందిని ప్రశ్నించారు.

ఈ సందర్భంగా అక్కడ ఉన్న సర్పంచ్ మాట్లాడుతూ మందుల కొరత ఉందని, డెలివరీ అనంతరం శిశువులకు టీకాలు వేయించేందుకు సబ్ సెంటర్‌కు వెళ్లడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కలెక్టర్‌కు తెలియజేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారితో మాట్లాడి వైద్య శాఖ సిబ్బంది శిశువులకు టీకాలు ఆసుపత్రిలోనే అందించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, ఉపాధ్యాయులను యాప్ వినియోగం గురించి ప్రశ్నించారు.ఉపాధ్యాయులు, విద్యార్థులు బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేస్తూ, అక్షయపాత్ర భోజనం మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి భోజనం చేయాలన్న కమిటీ నిర్ణయాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఉపాధ్యాయులు విద్యతో పాటు మంచి అలవాట్లు కూడా విద్యార్థులకు నేర్పాలని సూచించారు. విద్యార్థులతో భోజనం నాణ్యతపై మాట్లాడగా, వారు భోజనం సరిగా లేదని తెలిపారు. దీని పై స్పందించిన కలెక్టర్, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తదుపరి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, భూభారతి పెండింగ్ ఫైళ్లపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను సత్వరమే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కోయిలకొండ తహసీల్దార్ రాజా గణేష్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హత్యను ఖండిస్తూ విధుల బహిష్కరణ



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** చేవెళ్ల బార్ అసోసియేషన్ సభ్యులు, యువ మహిళా న్యాయవాది స్వప్న అమానుష హత్యను మిర్యాలగూడ బార్ అసోసియేషన్ తరుపున తీవ్రంగా ఖండిస్తు న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. హత్య చేసిన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ బార్ కౌన్సెల్ ను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామనీ, స్వప్న ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తు వారి కుటుంబ సభ్యులందరికీ మిర్యాలగూడ బార్ అసోసియేషన్ బాధ్యులు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నేతి సత్యనారాయణ, జనరల్ సెక్రెటరీ అలుగుబెల్లి భూపతి రెడ్డి, కోశాధికారి గొడ్డటి సాయికుమార్ యాదవ్, సుదర్శనం రాంబాబు, లింగంపల్లి అంజయ్య, కోడిద సత్యనారాయణ, కర్ణం లింగయ్య, ధూపాటి మట్టయ్య, నరసింహారావు, వేణుగోపాల్, శ్రీదేవి, అలుగుబెల్లి స్వరాజ్యం, రాయారపు భాస్కర్, శీలం వీరేంద్ర నాయుడు, కందిబండ శ్రీనివాస్, బాలునాయక్, పెద్దమం కిరణ్, రంగారావు, మాతంగి సైదులు పాల్గొన్నారు.

## విధులకు గైర్హాజరైన ముగ్గురు వైద్యులకు షోకాజ్ నోటీసులు

**రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసిన టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్**





**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ జె.అజయ్ కుమార్ హెచ్చరించారు. గురువారం రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపి విభాగం, వార్డుల్లో తిరిగి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. హాజరు రిజిస్టర్లను పరిశీలించి అనుమతులు లేకుండా గైర్హాజరైన ముగ్గురు డాక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వైద్యులతో సమావేశమై ఆస్పత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. రోగులకు అందిస్తున్న మందులపై ఆరా తీశారు. మందుల నిల్వలను పరిశీలించారు.అత్యవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. అనంతరం స్థానిక నాయకులు ఆయనను కలిసి ఆస్పత్రి భవనం శిథిల దశకు చేరుకుందని, నూతన భవనంను ఏర్పాటు చేయాలని, ఆస్పత్రి స్థాయిని వంద పడకలకు పెంచాలని కోరారు. వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణం పరిశీలనలో ఉందని ఈ సందర్భంగా ఆయన వారికి తెలిపారు. ఆయన వెంట డీసీహెచ్ఎస్ చిన్నా నాయక్, వైద్యులు స్వాతి బాయి, నవీన్ సింగ్, మాధవచారి, దేవేందర్, సుమంగళి, హెడ్ నర్సులు సువర్ణ, సోలి, జ్యోతి, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది ఉన్నారు

## ప్రజా సమస్యలే ఎజెండాగా గుమడాల రాధ ప్రచారం





**మహబూబ్‌నగర్, అక్షిత ప్రతినిధి :** మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల వేళ 24వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్న జర్నలిస్ట్ గోవర్ధన్ గౌడ్ సతీమణి గుమడాల రాధ తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు. వార్డులోని పలు వీధుల్లో ఇంటింటికీ తిరుగుతూ, స్థానిక ప్రజల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో జర్నలిస్టుల హక్కుల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న గోవర్ధన్ గౌడ్ కి ఉన్న ఇమేజ్, ఈ ఎన్నికల్లో రాధ కి ప్లస్ పాయింట్‌గా మారింది. జర్నలిస్ట్ లోకం మొత్తం తమ కుటుంబ సభ్యురాలిగా భావించి ఆమె గెలుపు కోసం స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొంటోంది. వార్డు అభివృద్ధికి సరికొత్త ప్రణాళిక: ప్రచారంలో భాగంగా రాధ మాట్లాడుతూ.. "జర్నలిస్ట్ కుటుంబం నుంచి వచ్చిన నాకు సామాన్యుల కష్టాలు తెలుసు. పదవుల కోసం కాకుండా, సేవ చేయడం కోసమే రాజకీయంలోకి వచ్చాను. వార్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాలు, తాగునీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరించడమే నా మొదటి ప్రాధాన్యత" అని పేర్కొన్నారు. ప్రజల నుంచి విశేష స్పందన వార్డులోని మహిళలు, వృద్ధులు రాధకి హారతులు పట్టి ఘనస్వాగతం పలుకుతున్నారు. నిరంతరం అందుబాటులో ఉండే వ్యక్తిగా, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న కుటుంబం నుంచి వచ్చిన అభ్యర్థి కావడంతో ఓటర్లు ఆమె వైపు మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలల్లో 'సృజన టెక్ ఫెస్ట్'

**విద్యార్థుల ప్రతిభకు ప్రశంసలు**



**వనపర్తి, అక్షిత ప్రతినిధి :** రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రతి సంవత్సరం నిర్వహించే ' సృజన టెక్ ఫెస్ట్?2026' కార్యక్రమం ఫిబ్రవరి 5న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయిలో ఘనంగా జరిగింది. ఈ టెక్ ఫెస్ట్‌ను జిల్లాలోని కేడీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ డా. ఎన్.వి.ఎస్. రాజీ, ప్రొఫెసర్ బి. తేజవర్ధన్, టెక్ ఫెస్ట్ కోఆర్డినేటర్ బి. శ్యామ్‌రాజ్ (మెకానికల్ హెచ్‌ఓడి), అలాగే కేడీఆర్ జీపిటి ప్రిన్సిపాల్ బి. జగన్ ఆధ్వర్యంలో నిర్వహణ జరిగింది.ఈ సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలైన మహబూబ్‌నగర్, కొదాడ, వడెపల్లి, కేడీఆర్ తదితర కళాశాలల విద్యార్థులు రూపొందించిన సాంకేతిక ప్రాజెక్టులను జ్యూరీ సభ్యులు సునిశితంగా పరిశీలించారు.ప్రాజెక్టుల రూపకల్పన, వినియోగ సామర్థ్యం, సమాజానికి ఉపయోగకరత అంశాలను ఆధారంగా తీసుకుని జ్యూరీ సభ్యులు గ్రేడింగ్ చేసి బహుమతులు ప్రకటించారు.రైతులకు అత్యంత ఉపయోగకరంగా రూపొందించిన ధాన్యాలు ఎండబెట్టే యంత్రం ప్రాజెక్టుకు గాను కేడీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు.

ప్రథమ బహుమతి సాధించిన సందర్భంగా కేడీఆర్ జీపిటి డీఎంఈ 2023?26 బ్యాచ్ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, మెకానికల్ హెచ్‌ఓడి శ్యామ్‌రాజ్ , మెకానికల్ శాఖ అధ్యాపకులు, సీనియర్ లెక్చరర్లు, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ మరిన్ని వినూత్న, ప్రజాప్రయోజన ప్రాజెక్టులు రూపొందించి రాష్ట్ర స్థాయిలో కళాశాల పేరు ప్రతిష్టలను పెంచాలని విద్యార్థులను ప్రోత్సహించారు.ఈ ప్రాజెక్టు లోకల్ మరియు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించడంతో పాటు, రాష్ట్ర స్థాయి 'తెలంగాణ స్టేట్ లెవెల్ టెక్ ఫెస్ట్'కు ఎంపికై పాల్గొనే అనుమతి పొందింది.

# వైద్య సిబ్బంది సమన్వయంతో ప్రజలకు వైద్య సేవలు అందించాలి



**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు**

**వరంగల్, అక్షిత బ్యూరో:** వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి జిల్లా ప్రజలకు సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వరంగల్ డాక్టర్ బి సాంబశివరావు వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు మాట్లాడుతూ జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల సూచికలను ప్రభుత్వము నిర్దేశించిన ప్రకారము సేవలందించి ఆన్లైన్లో నమోదు చేయాలని కోరినారు. ఆశా కార్యకర్త నుండి వైద్యాధికారి వరకు సమన్వయముతో పనిచేసే ఫలితాలు రాబట్టాలని, ఎవరైనా సమయపాలనను పాటించకుంటే వారి పైన పై అధికారులకు నివేదికలు పంపించి చర్యలు తీసుకుంటామని తెలిపినారు . డాక్టర్ ప్రకాష్ డిప్యూటీ డిఎంహెచ్వో నర్సంపేట మాట్లాడుతూ జిల్లాలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని కోరినారు త్వరలో క్యాన్సర్ వ్యాధి రాకుండా 15 సంవత్సరాల లోపు పిల్లలకు ఇవ్వవలసిన వ్యాక్సినేషన్ ప్రారంభిస్తామని తెలిపినారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సిబ్బందికి హెపటైటిస్ బి వ్యాక్సినేషన్ ఇవ్వడానికి వెంటనే ప్రారంభించాలని కోరినారు.



డాక్టర్ సయ్యద్ ఇఫ్తార్ అహ్మద్ సంక్రమిత అసంక్రమిత వ్యాధుల నివారణ ప్రోగ్రాం అధికారి మాట్లాడుతూ జిల్లాలో 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరిని స్క్రీనింగ్ చేసి వారిలో ఉన్న అసంక్రమిత వ్యాధుల ను గుర్తించి తగిన పరీక్షలు చేసి చికిత్సలు అందించి ఆన్లైన్లో నమోదు చేయాలని కోరినారు. వైద్యాధికారులు వారికి సంబంధించిన సిబ్బంది నీ ప్రోత్సహించి టార్గెట్ ను మార్చి 31 వరకు పూర్తి చేయాలని తెలిపినారు.

డాక్టర్ ప్రసన్నలక్ష్మి మాత శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి మాట్లాడుతూ జిల్లాలో ప్రతి గర్భిణీ స్త్రీని నమోదు చేసి వారికి అందించవలసిన సేవలు అందించి మాతా శిశు మరణాలు లేకుండా చూడాలని కోరినారు.

డాక్టర్ సరిత ఎన్ సి డి డాక్టర్ సత్యేంద్రనాథ్,డాక్టర్ బ్లెస్సి,డేవిడ్ వైద్యాధికారులు, పల్లె దావకాన డాక్టర్లు, డిప్యూటీ డెమో అనిల్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

# న్యాయవాది హత్యోదంతం.. అత్యంత దారుణం

**షాద్ నగర్‌లో న్యాయవాదుల విధుల బహిష్కరణ..**

**అడ్వకేట్ ప్రొటెక్ట్ యాక్ట్ తేవాలి**

**న్యాయవాదుల డిమాండ్**

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం**



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి :** మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లి గ్రామంలో మహిళా న్యాయవాదిని అతి దారుణంగా హతమార్చడం హేయనీయమని షాద్ నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ రావు, ప్రధాన కార్యదర్శి గుండుబాయి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో హత్యకు గురైన న్యాయవాది స్వప్న చిత్రపటానికి న్యాయవాదులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె కుటుంబానికి ఆ దైవం మనోధైర్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ న్యాయవాదులపై జరుగుతున్న హత్యలు దాడులను అరికట్టే విధంగా ప్రభుత్వాలు న్యాయవాదులకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం కోర్టు ప్రధాన ద్వారం వద్ద న్యాయవాదులు నిరసన తెలిపారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తేవాలంటూ నినాదాలు చేశారు. అనంతరం న్యాయవాదులంతా కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ కోరుతూ వినతిపత్రం అందించారు.

**సమస్యను అసెంబ్లీలో చర్చిస్తా..**
**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**

ప్రతినిత్యం దగాపడ్డ సామాన్యులకు న్యాయాన్ని అందించేందుకు కృషి చేసే న్యాయవాదులను హత్య చేయడం అత్యంత హేయనీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. న్యాయవాదుల విన్నపం నూటికి నూరుపాళ్ళు సరైనదని, దీనిపై అసెంబ్లీ సెషన్ లో మాట్లాడి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని పేర్కొన్నారు. అనంతరం న్యాయవాదులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్ కు చెందిన న్యాయవాదులందరూ ఆందోళనలో పాల్గొన్నారు..



## మృతుని కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల చేయూత



**కల్వకుర్తి, అక్షిత ప్రతినిధి :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామపంచాయతీ పరిధిలో ఇస్రాయి పల్లి గ్రామంలో రాసులపల్లి రాములయ్య అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం తెల్లవారుజామున చనిపోవడం జరిగింది ఇట్టి విషయాన్ని స్థానిక నాయకులు ద్వారా తెలుసుకున్న తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకురి ప్రభాకర్ రెడ్డి మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ స్థానిక నాయకుల ద్వారా 3000 వేల రూపాయలు శతాబ్ది టౌన్షిప్ ఎండి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, లింగరావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి 4000 వేల రూపాయలు మొత్తం కలిపి 7000 వేల రూపాయల ఆర్థిక సహాయం స్థానిక నాయకుల ద్వారా ఆ కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో వెల్జాల్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఎంఎ అజీజ్, ఇస్రాయి పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ యువకులు కశి రెడ్డి ప్రకాష్ రెడ్డి, శ్రీశైలం,సాయికిరణ్, శ్రీశైలం, నరేష్, ప్రసాద్, నవీన్, మహేష్ వెంకటేష్, బాలస్వామి, ఎద్దుల వెంకటేశ్, బాలకృష్ణ, నరేష్, రాములయ్య, లక్ష్మయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సమ్మెను జయప్రదం చేయండి

**కార్మిక హక్కులను రక్షించుకుందాం**

**ఏఐసిసిటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు**



**వరంగల్, అక్షిత బ్యూరో:** భారతదేశంలో స్వతంత్రానికి పూర్వం నుండి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులు చట్టాలను రక్షించుకుందామని యావత్తు కార్మికుల ఐక్యతను చాటుదామని దేశంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించి ఫిబ్రవరి 12 న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక జాతీయ కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐసిసిటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ కరపత్రం గుమ్మడి రాజుల సాంబయ్య అధ్యక్షతన ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ అక్కెనపల్లి యాదగిరి ఎం డి కాజా మోహినుద్దీన్ కన్నూరి డానియల్ మహంకాళి శ్రీనివాస్ బోట్ల ప్రభాకర్ ఇందూరి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అండగా లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్



**కల్వకుర్తి, అక్షిత ప్రతినిధి :** గతనెల 29 న చంద్రధన హై స్కూల్ లో కంటిపరీక్షల నిర్వహణ అనంతరం, 15 మంది విద్యార్థులకు కంటి చూపు సమస్య ఉందని గుర్తించిన లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్, 15 మంది విద్యార్థులకు కళ్లద్దాలు అందించారు. ప్రముఖ ఆప్థమాలజిస్ట్ లయన్ చంద్రశేఖర్ గారు కంటి సమస్యలు రాకుండా ఉండేందుకు జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ గోవర్ధన్ రెడ్డి గారు మాట్లాడుతూ, ఇదే విధంగా అన్ని స్కూళ్లలో లయన్స్ క్లబ్ అధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి , సమస్యలు ఉన్న వారికి ఉచితంగా కళ్ళద్దాల పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించి, కళ్లద్దాల దాతలైన లయన్ మోహన్ రెడ్డి గారిని , లయన్ పాండురంగారెడ్డి గారిని , చంద్రధన ఉపసర్పంచ్ రవీందర్ రెడ్డి గారిని , క్లబ్ అధ్యక్షులు గోవర్ధనరెడ్డి గారు అభినందించారు. ఈ కార్యక్రమం అనంతరం రాంపూర్ హై స్కూల్ లో 60 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 5 మంది విద్యార్థులకు కంటి చూపు సమస్య ఉందని గుర్తించి, వారికి త్వరలోనే కళ్లద్దాల పంపిణీ చేస్తామని గోవర్ధన్ రెడ్డి గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ లయన్ గంప శ్రీను , ట్రెజరర్ లయన్ శ్రీనివాస్ రెడ్డి,పి ఆర్ ఓ పాషా , పాఠశాల ప్రిన్సిపాల్ శోభ రాణి , వైస్ ప్రిన్సిపాల్ అరవింద్ కుమార్, మణిపాల్ రెడ్డి,వార్డు సభ్యులు బాలరాజు, మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తిరుమలగిరి పట్టణంలో పోలీసుల కవాతు



**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:** ఈనెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓటర్లకు నమ్మకం కలిగించే విధంగా మేమున్నామంటూ నాగారం సర్కిల్ పోలీసు ఆధ్వర్యంలో గురువారంనాడు తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని పలు వార్డులలో నాగారం సిఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు, ఈ సందర్భంగా తిరుమలగిరి పోలీస్ స్టేషన్ నుండి సూర్యాపేట రోడ్, తొర్రూర్ రోడ్ లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ నాగేశ్వరావు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు ముందు జాగ్రత్త గా ఓటర్లకు ప్రజలకు అండగా మేమున్నామంటూ ప్రదర్శన నిర్వహించారు ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి వివిధ పార్టీల అభ్యర్థులు తమ ప్రచారం నిర్వహించుకోవాలని కోరారు. ఎన్నికల్లో ఓటర్లను మభ్య పెట్టే విధంగా ప్రవర్తిస్తూ కులాలు మతాలను రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చ రించారు గ్రామాల్లో ఓటర్లను మభ్య పెట్టే విధంగా ప్రవర్తించే వారికి పట్ల అప్రమత్తంగా ఉండాలని అలాగే పోలీస్ శాఖకు వెంటనే ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి ఎస్సై గుత్తా వెంకటరెడ్డి, నాగారం ఎస్సై చిరంజీవి, జాజిరెడ్డిగూడెం ఎస్సై సైదులు తోపాటు ఏఎస్ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

# పంట పొలాల చుట్టూ విద్యుత్ ఫెన్సింగ్ ప్రాణాంతకం

### ఎన్ పి డి సి ఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తం జాడే




**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** అడవి జంతువుల నుండి పంటల రక్షణ పేరుతో విద్యుత్ ఫెన్సింగ్ ఏర్పాటు ప్రాణాంతకం అని ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ ఫెన్సింగ్ చేయవద్దని ఎన్ పి డి సి ఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ అన్నారు.అడవి జంతువుల నుండి పంటలను కాపాడుకునేందుకు వరి పొలాలు, వ్యవసాయ భూముల చుట్టూ అక్రమంగా విద్యుత్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం వల్ల తీవ్రమైన విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆయన తెలిపారు.ఈ ప్రమాదాల కారణంగా గతంలో అనేక చోట్ల రైతులు, వ్యవసాయ కూలీలు, అలాగే పశువులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు చోటుచేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ లైన్లకు నేరుగా లేదా అనధికారికంగా వైర్లు అనుసంధానించి ఫెన్సింగ్ చేయడం పూర్తిగా చట్టవిరుద్ధమని, ఇది అత్యంత ప్రమాదకరమైనదని స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో లేదా వర్షాకాలంలో ఈ ఫెన్సింగ్ మరింత ప్రమాదకరంగా మారి, పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు తెలియక వాటిని తాకితే ప్రాణాలు కోల్పోయే ప్రమాదాలకు దారి తీస్తుందని తెలిపారు.

విద్యుత్ ఫెన్సింగ్ కారణంగా కేవలం మనుషులకే కాకుండా, ఆవులు, ఎద్దులు, మేకలు వంటి పశువులు కూడా విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడుతున్నాయని ఎస్ఈ తెలిపారు. ఇది వారి కుటుంబాలకు తీరని నష్టం కలిగిస్తోందని పేర్కొన్నారు.

అక్రమంగా విద్యుత్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ప్రాణాల భద్రతే విద్యుత్ శాఖ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

రైతులు మరియు ప్రజలు తమ వరి పొలాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయరాదని, పంట రక్షణ కోసం సురక్షితమైన ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని ఎస్ఈ విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా సోలార్ ఆధారిత ఫెన్సింగ్, గార్డింగ్, ఇతర సురక్షిత వ్యవసాయ పద్ధతులను వినియోగించుకోవాలని సూచించారు.

ప్రజలు తమ పరిసరాల్లో ఎక్కడైనా అక్రమ విద్యుత్ ఫెన్సింగ్ ఉన్నట్లు గమనిస్తే వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఈ కోరారు . విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

# బీసీ సబ్ ప్లాన్ ప్రకటించాలి

### ఎన్నికల ముందు హామీలు,బడ్జెట్లో అత్తెసరు కేటాయింపులు,అమలులో అన్యాయం

### వరంగల్ కాకతీయ యూనివర్సిటీ వేదికగా మరో పోరాటానికి సిద్ధమవుతున్న బీసీలు



**వరంగల్, అక్షిత బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ లో బీసీలకి సబ్ ప్లాన్ ప్రకటించాలని బీసీ సబ్ ప్లాన్ సాధన కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ కె. మురళీ మనోహర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు అధ్యక్షతన నక్కలగుట్ట లో జరిగిన సమావేశంలో ప్రొఫెసర్ కె. మురళీ మనోహర్ మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన మేరకు బీసీలకి సబ్ ప్లాన్ ప్రకటించాలని డిమాండ్ చేసినారు.

2011 నుండి బీసీలకి సబ్ ప్లాన్ ప్రకటించాలని చేసిన ఉద్యమ ఫలితంగా 2013లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభలో బీసీలకి సబ్ ప్లాన్ ప్రకటించింది కానీ రాష్ట్ర విభజన వలన ఆ హామీ కార్యరూపం దాల్చ లేదని అభిప్రాయపడినారు. 2023 శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన మేరకు బీసీలకి సబ్ ప్లాన్ ప్రకటించడంతోపాటు బడ్జెట్ లో బీసీల సంక్షేమానికి 20వేల కోట్ల రూపాయల నిధులను కేటాయించాలని డిమాండ్ చేసినారు. ప్రొఫెసర్ ఎం. సారంగపాణి, ప్రొఫెసర్ గోపు సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అయిన తర్వాత ప్రవేశపెట్టిన 12 బడ్జెట్ లలో బీసీల సంక్షేమానికి మూడు శాతం కంటే తక్కువ నిధులు కేటాయించడమే కాదు కేటాయించిన నిధులను కూడా ఖర్చు చేయడం లేదని విమర్శించారు. బీసీ కార్పొరేషన్ల కి కుల ఫెడరేషన్లకి బడ్జెట్ లో తక్కువ నిధులను కేటాయిస్తూ ఆ కేటాయించిన నిధులను కూడా ఖర్చు చేయకపోవడం వలన బీసీలకి, కులవృత్తిదారులకు అన్యాయం జరుగుతుందని అభిప్రాయబడినారు.

కేయూ బీసీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ గడ్డం. కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండానే ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించింది ఇప్పుడు మున్సిపాలిటీ ఎన్నికలను కూడా నిర్వహిస్తుందని అభిప్రాయబడినారు.

ఎంబీసీ నాయకులు డాక్టర్ పాలడుగుల సురేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన రిపోర్టుని ఆయా కులాల వెనుకబాటుతనానికి సంబంధించిన పూర్తి నివేదికను బయటపెట్టాలని డిమాండ్ చేసినారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కె. మురళీ మనోహర్ రూపొందించిన బీసీ సబ్ ప్లాన్ డ్రాఫ్ట్ ని విడుదల చేసినారు.

ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు ఎదునూరి రాజమౌళి ధారబోయిన సతీష్ డాక్టర్ ఎర్ర బొజ్జు రమేష్ డాక్టర్ కత్తెరశాల దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# నెక్కొండ అండర్ బ్రిడ్జిలో ముగియని జలవిలయం..

**శాశ్వత పరిష్కారం ఎప్పుడు?**
**నిరంతరం ఊరుతున్న నీరు..**
**నిత్యం నరకప్రాయంగా ప్రయాణం..**
**అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిలువుటద్దం!**



**నర్సంపేట అక్షిత ప్రతినిధి:** వరంగల్ జిల్లా, నెక్కొండ మండల కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. వర్షం ఉన్నా లేకపోయినా ఏడాది పొడవునా ఈ బ్రిడ్జి కింద నీరు వస్తూనే ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. మండలంలో అత్యంత కీలకమైన ఈ మార్గంలో నిత్యం వేలాది మంది ప్రయాణిస్తున్నా, సమస్యను పరిష్కరించడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైందని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పాములు, కప్పల నివాసం..**
**భయం గుప్పిట్లో ప్రయాణం**

అండర్ బ్రిడ్జి కింద నిరంతరం నీరు నిల్వ ఉండటంతో అది మురికిగుంటలా తయారైంది. అందులో పాములు, కప్పలు చేరుతుండటంతో అటుగా వెళ్లే పాదచారులు, ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. నిత్యం నీటిలో నడవాల్సి



రావడంతో విద్యార్థులు అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

**తుప్పు పడుతున్న వాహనాలు.. సామాన్యులపై ఆర్థిక భారం**

ఈ మార్గంలో ప్రయాణించే ద్విచక్ర వాహనాలు, కార్లు నిత్యం నీటిలో నానుతుండటంతో త్వరగా తుప్పు పట్టి పాడవుతున్నాయి. ఇంజన్లలోకి నీరు చేరి వాహనాలు మధ్యలోనే ఆగిపోతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కష్టపడి సంపాదించిన సొమ్మును నిత్యం రిపేర్లకే ఖర్చు చేయాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు.

**స్తంభిస్తున్న రాకపోకలు..**

నెక్కొండ మండల ప్రజల రాకపోకలకు ఈ అండర్ బ్రిడ్జి అత్యంత కీలకం. కానీ ఇక్కడ నిరంతరం నిలిచి ఉండే నీటి వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా తయారై మండలంలోని పలు గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి.

**శాశ్వత పరిష్కారం చూపాలి: మండల ప్రజల డిమాండ్**

అధికారులు ఎప్పుడు ఫిర్యాదు చేసినా కేవలం మోటార్లతో నీటిని తోడేసి తాత్కాలికంగా మమ అనిపిస్తున్నారే తప్ప, నీరు ఊరకుండా శాశ్వత చర్యలు చేపట్టడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. "మాకు తాత్కాలిక మరమ్మతులు వద్దు.. వాటర్ ప్రూఫింగ్ లేదా ఆధునిక డ్రైనేజీ వ్యవస్థతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి" అని నెక్కొండ మండల ప్రజలు, ప్రయాణికులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం, రైల్వే ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# ఇంటింటా కాంగ్రెస్ ప్రచారం

**దేవరకద్ర మున్సిపాలిటీలో జోరుగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం**

**దేవరకద్ర, అక్షిత న్యూస్:** దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా విస్తృతంగా పర్యటించి, కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓటు వేసి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరిన దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ...గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో దేవరకద్ర పట్టణ అభివృద్ధిని పట్టించుకోలేదని, కమిషన్లు వచ్చే పనులు తప్ప ప్రజలకు ఉపయోగపడే పనులను చేయలేదని, అండర్పాస్ నిర్మించాల్సిన చోట ఫ్లైఓవర్ నిర్మించి దేవరకద్రను రెండుగా చీల్చారని గత ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. గత ప్రభుత్వం పదేళ్లుగా అధికారంలో ఉండి దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో ఒక డిగ్రీ కాలేజ్ ను తీసుకు రాలేదని, హాస్పిటల్ ను నిర్మించలేదని, కోర్ట్ ను ఏర్పాటు చేయలేదని, దేవరకద్ర పట్టణాన్ని మున్సిపాలిటీగా గుర్తించలేదని గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేశామని, కాలేజ్ భవన నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే ఆరు కోట్ల నిధులు కేటాయించిందని,



త్వరలో డిగ్రీ కాలేజ్ భవన నిర్మాణాన్ని చేపడతామని అన్నారు. ఇప్పటికే 100 పడకల హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, పనులు ప్రారంభమయ్యాయని, త్వరలో పనులు పూర్తవుతాయని, అదేవిధంగా తొందర్లోనే కోర్టు కార్యకలాపాలు మొదలవుతాయని అన్నారు.

అంతేకాక ఇటీవల 25 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసుకున్నామని, మొన్నటికి మొన్న అయిదు కోట్ల రూపాయల నిధులతో నూతన మున్సిపల్ ఆఫీస్ కు సంబంధించిన భవన నిర్మాణానికి భూమి పూజ చేశామని, దేవరకద్ర మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు.

పదేండ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం దేవరకద్ర పట్టణంలో ఒక్క డబల్ బెడ్ రూమ్ ఇల్లు, ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, మన ప్రభుత్వం దేవరకద్ర పట్టణంలో మొదటి విడతలో 77 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని, రేషన్ కార్డులు ఇచ్చామని అన్నారు, ఏప్రిల్ నెలలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్లను ఇస్తామని తెలిపారు.

గత పదేళ్లు పాలించిన కెసిఆర్ ప్రభుత్వం 8 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి తెలంగాణ ఆగం చేశారని, కెసిఆర్ చేసిన అప్పులకు మిత్తిలు కట్టుకుంటూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఒక్కొక్కటిగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు అందులో భాగంగా మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, 10 లక్షల ఆరోగ్య శ్రీ, 500 లకే సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని, రెండు లక్షల రుణమాఫీ చేశామని, దేశంలో ఎక్కడ లేని విధంగా ఏడాదికి 13 వేల కోట్లు వెచ్చించి రేషన్ పై సన్న బియ్యం ఇస్తున్నామని తెలియజేసారు.

దేవరకద్ర పట్టణం అభివృద్ధి చెందాలంటే అధికార కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, అధికార పార్టీకి ఓటు వేసి అభివృద్ధికి బాటలు వేద్దామని దేవరకద్ర ప్రజానీకానికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే స్వర్గ సుధాకర్ రెడ్డి , టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ రెడ్డి కౌన్సిలర్ అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

## యువత తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు

**తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్**



**హైదరాబాద్ ఫిబ్రవరి 5:** నిరుద్యోగ యువత తలుచుకుంటే, ఏమైనా చేయగలరని, గత అసెంబ్లీ ఎన్నికలే నిరూపించాయని, గత ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీని ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించింది యువశక్తి మాత్రమే అని ప్రభుత్వ ఉద్యోగాలపై తప్పుడు ప్రచారాలు యువత నమ్మవద్దని బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. గురువారం నాడు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు కొలువుల పండుగ వివిధంగా జరిగిందో అందరం చూసామని, రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు ఎందుకు ఇచ్చాము అంటే అది యువతలో భరోసా కల్పించేందుకే అని వివరించారు నోటిఫికేషన్ ఇస్తే కొలువు వస్తుందని భరోసా కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోని నిరుద్యోగులకు కలిగిందని పేర్కొన్నారు.

**ప్రభుత్వ ఉద్యోగాలు అప్పుడు అంగట్లో సరుకు**

గత ప్రభుత్వ హయాంలో 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న ప్రభుత్వం ఉద్యోగాలను అంగట్లో సరుకు అమ్మినట్లు అమ్మిందని, పది సంవత్సరాలు యువతను ఇబ్బంది పాలు చేసిన గత పాలకులు నేడు సానుభూతి వలక బోస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ వన్ టైం పాస్వర్డ్ రిజిస్టర్ ప్రాసెస్ చేస్తుందని పోలీస్ శాఖలో రిక్రూట్మెంట్ చేస్తుందని, యువతను రెచ్చగొట్టాలని చూస్తే, ఎవరు ఊరుకోరని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలోనే ఉద్యోగాలపై భారీ ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో యువత ప్రతిపక్షాలు చేసే తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని నిరుద్యోగ యువతకు నూతి శ్రీకాంత్ గౌడ్ భరోసా ఇచ్చారు.

## చెక్ పోస్టులను తనిఖీ చేసిన ఈస్ట్ జోన్ డిసిపి



**వరంగల్, అక్షిత బ్యూరో:** పరకాల మున్సిపాలిటీ ఎన్నికలను పురస్కరించుకొని పరకాల పట్టణ మున్సిపల్ సరిహద్దుల్లో నాలుగు స్టాటిక్ సర్వ లైన్స్ టీంలతో ఏర్పాటు చేసిన హన్మకొండ, హుజురాబాద్,చలివాగు బ్రిడ్జ్ వెల్లంపల్లి మార్గాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టులను ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న తీరుపై డీసీపీ చెక్ పోస్ట్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తనిఖీ కేంద్రాల్లో నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. డీసీపీ వెంట పరకాల ఏసీపీ సతీష్ బాబు, ఇన్స్పెక్టర్ క్రాంతి కుమారు పాల్గొన్నారు.

# మున్సిపల్ పోలింగ్‌లో పిఓలు, ఏపిఓల పాత్ర కీలకం

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కే. హరిత**



**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** రెండవ సాదారణ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియనుపోలింగ్ అధికారులు సహాయ పోలింగ్ అధికారులు తమకు అప్పగించిన విధులను పకడ్బందీగా నిర్వహించాలని, ఎన్నికల విజయవంతంలో వారి పాత్రే కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కే . హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో పోలింగ్ అధికారులు సహాయ పోలింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ కే. హరిత ఎన్నికల సాదారణ పరిశీలకులు ఆలోక్ కుమార్ ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు శిక్షణ ఐ ఎఫ్ ఎస్ అధికారి భార్గవ్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధిమాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పోలింగ్ అధికారులు సహయ పోలింగ్ అధికారులు సమర్తవంతంగా నిర్వహించాలన్నారు. మున్సిపల్ ఎన్నికలు బ్యాలెట్ పద్దతిలో ఉంటాయని పోలింగ్ ప్రక్రియలో వినియోగించే ప్రతి పత్రము పై అవగాహనా కలిగి ఉండాలని సూచించారు. పి ఓ డైరీలో ప్రతి అంశాని క్షుణ్ణంగా నమోదు చేయాలన్నారు . ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతాన్ని జోనల్ అధికారులకు అందించాలన్నారు . పోలింగ్ ప్రక్రియలో వినియోగించే సామాగ్రిని, బ్యాలెట్ పత్రాలను సరి చూసుకోవలన్నారు. పోలింగ్ ప్రక్రియలో ఎ చిన్న పొరపాటు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేలా ఇతర పోలింగ్ సిబ్బంది సమన్వయము తో వ్యవహరించాలన్నారు . ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఎక్కడ ఉల్లంగికూడదన్నారు . ఎన్నికల కమిషాన్ నిబందనలకు లోబడి విదులు నిర్వహించాలన్నారు . ఈ కార్యక్రమంలో పోలింగ్ అధికారులు సహాయ పోలింగ్ అధికారులు మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా పౌర సంబందాల అదికారిచే జారి చేయడమైనది.



## గ్రామంలో దీర్ఘకాలిక విద్యుత్ సమస్యల పరిష్కారం

**సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ**



**అక్షిత న్యూస్ మునగాల:** నేడు మునగాల మండల పరిధిలోని నరసింహపురం గ్రామంలో ఎన్నో ఏళ్లుగా అపరిశు కృతంగా ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారం కొరకు ఇటీవల గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ సంబంధిత డి ఈ హుజూర్ నగర్ వారి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు నేడు గ్రామానికి అవసరమైన. విద్యుత్ స్తంభాలను అలాగే జనవాసాల మధ్యలో ఉన్న సింగల్ ఫేస్ ట్రాన్స్ఫారం లను మరియు. గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు నూతన కరెంటు వైర్లను ఏర్పాటు చేయడం ఇంకా తదితర విద్యుత్ సమస్యలను గ్రామ సర్పంచి పర్యవేక్షణలో దగ్గరుండి పర్యవేక్షించడమైనది ఈ సందర్భంగా సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు సహకరించిన సంబంధిత విద్యుత్ అధికారులకు సర్పంచ్ సత్యనారాయణ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఇలా గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యలను ఇలాగేసంబంధిత ప్రతి అధికారులు స్పందించి. చిత్తశుద్ధితో గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారం కొరకు కృషిచేసిస్థానిక సర్పంచులకు సహకరించాలని కోరారు ఇంకా ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు వీరబోయిన నరేష్. గ్రామపంచాయతీ సిబ్బంది. . విద్యుత్తు అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ప్రజల సమస్యల పరిష్కారనికై విద్యుత్ సదస్సులు

**ఎన్.వి వేణుగోపాల చారి**



**హనుమకొండ, అక్షత ప్రతినిధి:** విద్యుత్తు వినియోగదారుల సమస్యలు తెలుసుకోవడానికి ఫిర్యాదుల పరిష్కార వేదికలు నిర్వహిస్తున్నామని విద్యుత్తు వినియోగదారుల పరిష్కార వేదిక చైర్ పర్సన్ (సి జి ఎఫ్ -1) ఎన్. వి వేణుగోపాల చారి అన్నారు.హనుమ కొండ జిల్లా హసన్ పర్తి మండలం గురువారం ఎల్లాపూర్ గ్రామ సబ్ స్టేషన్ లో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైయి. వినియోగదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని వినతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు సేవలు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని, వినియోగదారుల ఇండ్లకు వెళ్లి సమస్యను రెండు రోజులలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సమస్యలను నిర్దేశించిన సమయంలో పరిష్కరించకపోతే తగిన ఆధారాలతో వినియోగదారుల ఫోరం దృష్టికి తెలపాలని సూచించారు. సమస్యలపై వినియోగదారులు వాట్సాప్ పోస్ట్ ద్వారా ఫిర్యాదు చేస్తే పరిష్కరించేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ నెంబర్ కె.రమేష్, ఎన్ దేవేందర్ మెంబర్ ఫైనాన్స్ , ఇండిపెండెంట్ మెంబర్ఎస్ ఇ ఓ పి మధుసూదన్, డిఇఓపి మల్లికార్జున్, ఎస్ ఏ ఓ హెచ్ ఎన్ కే నవీన్, ఏడిఈ హసన్ పర్తి పి అశోక్, ఏఈ లు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి నిర్మూలనకు సహకరించండి

**కోదాడ డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్: ఒంటెపాక అమర్ కుమార్**





**నడిగూడెం, అక్షిత న్యూస్:** స్పర్శ్ - లెప్రసీ వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలలో భాగంగా నడిగూడెం మండల కేంద్రంలో ని కస్తూర్బా బాలికల వసతి గృహంలో లెప్రసి వ్యాధి పై అవగాహన కార్యక్రమం నిర్వహించిన అనంతరం కోదాడ డివిజన్ డిప్యూటీ పారామెడికల్ అధికారి ఒంటెపాక అమర్ కుమార్ మాట్లాడుతూ "×వివక్షను అంతం చేయడం గౌరవాన్ని కాపాడటం×" అనే నినాదంతో ప్రతిజ్ఞ ను అన్ని వసతి గృహాలలో, పాఠశాల లో జనవరి 30,2026 నుండి ఫిబ్రవరి 13,2026 వరకు వైద్య ఆరోగ్య శాఖ చే నిర్వహిస్తారని కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, మందమైన మెరిసే జిడ్డు గల చర్మం, చెవులపై ,వీపుపై ,ఎదపై నొప్పిలేని బొడిపెలు, అరచేతులు అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, కాళ్లకు చెప్పులు జారిపోవడం, చేతుల నుండి వస్తువులు జారిపోవడం కాళ్లు చేతులు తిమ్మిర్లు కలిగి ఉండడం లాంటి లక్షణాలు ఉన్నట్లయితే స్థానిక ఆశా కార్యకర్తల కు, ఆరోగ్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని వారిని గుర్తించి నిర్ధారణ అనంతరం వారికి ఎం. డి. టి. చికిత్స విధానం ద్వారా వ్యాధిని నయంచేయవచ్చని తెలిపారు. సబ్ యూనిట్ అధికారి సముద్రాల సూరి హెల్త్ అసిస్టెంట్ తొనుకునూరి కృష్ణ మూర్తి, ఎ.ఎన్.ఎం సుజాత,కె. జి. బి. వి ఉపాధ్యాయినులు విజయ, సునీత మౌనిక, అనిత పాల్గొన్నారు.

## గ్రామీణ పేదలకు ఉచిత కంటి వైద్యం అందించడం అభినందనీయం

**యంపిడిఓ ఆవుల రాములు**

**మునిపంపులలో దేవిరెడ్డి రామిరెడ్డి జ్ఞాపకార్థం కంటి ఆపరేషన్ చేసుకున్న వారికి కంటి అద్దాల పంపిణీ**



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** గ్రామీణ పేదలకు ఉచిత కంటి ఆపరేషన్ చేయించి కంటి అద్దాలు ఇవ్వడం అభినందనీయమని మండల అభివృద్ధి అధికారి ఆవుల రాములు అన్నారు. మునిపంపుల మాజీ సర్పంచ్ దేవీ రెడ్డి రామిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు దేవి రెడ్డి వీరేందర్ రెడ్డి సహకారంతో గత 60 రోజుల క్రితం ఉచిత కంటి పరీక్షలు చేసి ఆపరేషన్ చేయించుకున్న వారికి ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలుపునూరి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల అభివృద్ధి అధికారి ఆవుల రాములు మాట్లాడుతూ సమస్య ఉండి కంటి వైద్యం చేయించుకోలేని పేదలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆపరేషన్ చేయించి కంటి అద్దాల పంపిణీ చేయడం అభినందనీయమని మానవసేవయే మాధవసేవ అన్నట్లుగా 2000 మందికి కంటి పరీక్షలు ఉపయోగపడడం మంచి పరిణామం అన్నారు. చాలామంది గ్రామీణ పేదలు కంటిచూపుతో ఇబ్బంది పడుతున్నారని అవగాహన లోపంతో కనీసం వైద్య పరీక్షలు కూడా చేసుకోవడం లేదన్నారు గత కాలం నుండి దేవిరెడ్డి కుటుంబ సభ్యులు గ్రామానికి వెన్నుదన్నుగా ఉండడం వారి సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవిరెడ్డి సావిత్రమ్మ, ఎంపీఓ రఫుల్ అలీ, గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం, మాజీ సర్పంచ్ కట్ట యాదయ్య, పంచాయతి కార్యదర్శి రచ్చ వేణు, అఖిల పక్ష నాయకులు తాళ్లపల్లి జితేందర్, ఉయ్యాల నర్సింహా,, గాదె కృష్ణ, ఎండి నజీర్, పులిపలుపుల నాగార్జున, గ్రామపంచాయతి సిబ్బంది బూడిద మారయ్య, ముత్తయ్య, రాములు తదితరులు పాసల్గొన్నారు.